సాక్షి నిర్మల్

ఆదివారం । 7 । జనవరి । 2024



సైబర్ దోపిడీ!

నులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడితే అన లుకే మోసం వస్తుంది. సైబర్ నేరస్తుల మాయ లో పడితే బ్యాంకుఖాతా ఖాళీ అవుతుంది. కొం దరు ఇలా డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

8లో▸

9న హిందీపై జాతీయ సెమినార్

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న హిందీ విభాగంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారిగా కళాశాలలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సెమినార్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రీసెర్చ్ స్కాలర్లు, ప్రొఫెసర్లు, అకడామీషియన్లు హాజరవుతారని తెలిపారు.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.5 / 17.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురిసే అకాశం ఉంది.

నాన్నే నాకు స్ఫూర్తి..



- ప్రజలకు దగ్గరగా ఉండాలని ప్రభుత్వ ఉద్యోగం..
- చిన్నప్పుడే పోలీస్ అంటే ఇష్టం..
- ఓ ఘటనతో సాఫ్ట్‌వేర్ నుంచి ఖాకీ డ్రెస్‌లోకి..
- గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యేవారు సొంతంగా నోట్స్ రాసుకోవాలి..
- ఇష్టంగా చదివితేనే లక్ష్యం చేరుకుంటారు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ జానకీషర్మిల

సాక్షి: గ్రూప్–1 విజేతగా యువతకు మీరిచ్చే సూచనలు..

ఎస్పీ : ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ఎవరో ఒకరిచ్చిన నోట్స్‌కే పరిమితం కావొద్దు. వివిధ రకాల పుస్తకాలు చదివి సొంతంగా నోట్స్ తయారు చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. నేను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకు న్నా. ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఇష్టపడి చదవాలి.

నిర్మల్: 'నాన్న ధనరాజుగారు ఎంఈవోగా ఉండే వారు. నిజాయతీగా పనిచేసేవారు. విధి నిర్వహ ణలో బాగా హార్డ్‌వర్క్ చేసేవారు. పేదపిల్లల చదు వుల కోసం సొంత డబ్బులు ఖర్చుచేశారు. నాన్న గారిని చూసే ప్రజలకు దగ్గరగా ఉండాలన్న ఆలోచన వచ్చింది. జీవితంలో జరిగిన కొన్ని ఘటనలూ నన్ను ప్రజాసేవ వైపు మళ్లించాయి. ఇక చిన్నప్పటి నుంచి పోలీస్ అంటే ఇష్టం. ఆ ఇష్టం తోనే డిపార్ట్‌మెంట్ వైపు వచ్చాను'అని తెలిపారు జిల్లా కొత్త ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల. జిల్లా కొత్త పోలీస్‌బాస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెతో 'సాక్షి' ఇంటర్వ్యూ..

సాక్షి: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడంపై ఎలా ఫీలవుతున్నారు..

ఎస్పీ : నిర్మల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం బాగుంది. రాష్ట్ర ఇంటలిజెన్స్ విభాగంలో ఏఎస్పీ గా చేసినప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు వచ్చాను. ఇక్కడికే ఎస్పీగా వస్తా నని ఊహించలేదు. నిర్మల్ పేరుకు తగ్గట్లుగా ఇక్కడి ప్రజలు ఉంటారనుకుంటున్నాను.

సాక్షి: మీరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేశారని తెలిసిం ది. మరి.. అటునుంచి పోలీస్‌వైపు ఎందుకు వచ్చారు..

ఎస్పీ : అవును. బీటెక్ పూర్తికాగానే ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ గా చేశాను. 2004లో జరిగిన ఓ ఘటన నన్ను మార్చేసింది. అప్పుడు జరిగిన ఓ రోడ్డుప్రమా దంలో ఏడాది వయసున్న కుమార్తెను కోల్పో యాను. అప్పటి నుంచి సమాజానికి దగ్గరగా ఉండాలని, ప్రజాసేవలో భాగం కావాలనుకునే దాన్ని. దీనికితోడు చిన్నప్పటి నుంచి పోలీస్ అం టే ఉన్న ఇష్టమే డిపార్ట్‌మెంట్‌వైపు మళ్లించాయి.

సాక్షి: మేడమ్.. మీ కుటుంబ నేపథ్యం..

ఎస్పీ : మాది తూర్పుగోదావరి జిల్లా. అమ్మ లలిత సుహాసిని టీచర్, నాన్న ధనరాజు ఎంఈవోగా చేశారు. అమ్మ అప్పట్లోనే ఎంఏ ఇంగ్లిష్ చదివి టీచరయ్యారు. ఒక బ్రదర్, సిస్టర్ ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లే. భర్త రత్నరాజు ఐఆర్ఎస్ అధికారి. ప్రస్తుతం చెన్నైలో ఇన్‌కంటాక్స్ అధికారిగా చేస్తున్నారు. వాళ్లది నిజామాబాద్ జిల్లా. మాకు ఇద్దరు బాబులు. వారు సివిల్స్ ప్రిపేరవుతున్నారు.

సాక్షి: మీకు నచ్చిన పోలీస్ జాబ్ ఎలా సాధించారు..

ఎస్పీ : 2004 ఘటన తర్వాత నేను ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమయ్యాను. 2007లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో గ్రూప్–1 అధికారిగా సెలెక్ట్ అయ్యాను. అందు లో డీఎస్పీగా ఎంపికయ్యాను. అలా ప్రజాసేవ లోకి అడుగుపెట్టాను. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో, పలు హోదాల్లో పనిచేశాను.

సాక్షి: ఒక మహిళా అధికారిగా కఠినమైన పోలీసుశా ఖలో మీ గుర్తింపు ఎలా ఉంది..

ఎస్పీ : మహిళలు తలచుకుంటే సాధించలేని రంగ మంటూ ఏదీ లేదు. శాఖాపరంగా అన్నిరకాలు గా ముందుకెళ్తున్నాం. నేను ఎక్కువగా సవాళ్లతో కూడిన క్రైం బ్రాంచ్‌లో చేశాను. రాష్ట్రంలో తొలి సారి కార్డెన్‌సెర్చ్‌ను హైదరాబాద్‌లోని జీడిమెట్ల సూరారంలో నేనే ప్రారంభించాను. ఎన్నో చైన్ స్నాచింగ్ కేసుల పరిష్కారంతోపాటు హైదరా బాద్ స్నేక్‌గ్యాంగ్, అభయ కేసు, చాందినీ హత్య తదితర సంచలన కేసులు దర్యాప్తు చేశాను.

సాక్షి: జిల్లాలో ఎక్కువగా ఏయే అంశాలపై దృష్టిపెడతారు..

ఎస్పీ : జిల్లాలో శాంతిభద్రతలపై ప్రధాన దృష్టిపెడతాను. ప్రజలందరి సహకారంతో జిల్లా ప్రశాంతంగా ఉండేలా చూస్తా. ప్రభు త్వం తీసుకున్న డ్రగ్స్‌రహిత సమాజం కోసం చర్యలు చేపడతా. జిల్లాలో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ శాఖపరంగా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం.

సాక్షి: మరి.. మీ పేరు ముందు డాక్టర్ ఎలా..

ఎస్పీ : (నవ్వుతూ..) నాకు చిన్నప్పటి నుం చి చదువంటే చాలా ఇష్టం. ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్, ఎంబీఏ పూర్తిచే శాను. పో లీస్ అయిన తర్వాత కూడా చదువుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ విభాగం లో 'ఉద్యోగులు అంకితభావంతో పనిచే సే విధానం' అంశంపై పీహెచ్‌డీ చేసి 2016లో డాక్టరేట్ పొందాను.

సాక్షి: మీ హాబీలు..

ఎస్పీ : పుస్తకాలు చదవడంతోపాటు గార్డెనింగ్ అం టే ఇష్టం. ఇంట్లోనే సేంద్రియ విధానంలో కిచెన్ గార్డెన్ చేస్తుంటా.

సాక్షి: జానకి, షర్మిల రెండు పేర్లు ఉండటం వెనుక..

ఎస్పీ : మా నాన్నమ్మ పేరు జానకమ్మ. మానాన్నకు అప్పటి నటి షర్మిలఠాగూర్ అంటే ఇష్టం. అలా.. వారిద్దరి పేర్లు వచ్చేలా మా నాన్నగారు నాకు జానకీషర్మిల అని పేరుపెట్టారు.

న్యూస్‌రీల్

ఎస్పీకి శుభాకాంక్షల వెల్లువ



ఎస్పీకి మొక్క అందిస్తున్న పాకాల రాంచందర్

నిర్మల్‌టౌన్: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జానకి షర్మిలను శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పలువురు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగు చ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పా కాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్, కూన రాజేశ్వర్, అనుముల భాస్కర్, దాసరి దశరథ్, లక్కడి సాయినాథ్‌రెడ్డి తదితరులు ఎస్పీని కలిశారు.

ర్యాట్ కిట్లు కావాలి

- ఆరోగ్య శాఖలో నిలిచిన కోవిడ్ నిర్ధారణ పరీక్షలు
- పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో అదే పరిస్థితి..

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల రాష్ట్రంలో కరోనా కేసు లు నమోదువుతున్నాయి. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జేఎన్–1 కొత్త వేరియంట్ వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లాలో కరోనా నియంత్రణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయి తే ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్స్, పీహెచ్‌సీలలో అనుమానితులకు ప రీక్షలు చేయడానికి ర్యాట్ కిట్స్ అందుబాటులో లేవు. ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రిలో మా త్రమే ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానితులు పెరిగితే ఆస్పత్రిలో చేయడా నికి ఇబ్బందులు ఎదురవుతాయి. లక్షణాలు ఉ న్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయించాల్సిన అ వసరం ఉంది. బాధితుడికి పాజిటివ్ ఫలితాలు వస్తే స్థానికంగా చికిత్స అందించడంతోపాటు జేఎన్–1 వేరియంట్ నిర్ధారణ కోసం నమూనా లను గాంధీ ఆస్పత్రికి పంపించి పరీక్షలు చే యించాలి. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడా నికి అవసరమైన ర్యాట్ కిట్లు, జిల్లా ఆరోగ్యశా ఖ వద్ద లేవు. దీంతో వైరస్ నిర్ధారణ జరుగడం లేదు. ఎవరు ఈ వైరస్ బారిన పడుతున్నారో తెలియడంలేదు.


చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వ హించే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను డీఈ వో రవీందర్‌రెడ్డి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థుల్లో పరిశీలన, ప్రశ్న, అధ్యయనం , హేతుబద్ధ ఆలోచన, పరిశోధనాశక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడానికి చెకుముకి టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్ రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్ర భుత్వ పరీక్షల జిల్లా సహాయ అధికారిని పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు నాయ క్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గాజర్ల నారాయణవర్మ, జనవిజ్ఞాన వేదిక శాస్త్ర, సాంకే తిక కమిటీ జిల్లా కన్వీనర్ పోలకొండ నారాయ ణవర్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాజ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో సుభాష్, ప్రబంధకారిణి సభ్యులు

భైంసాటౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని శ్రీసరస్వతి శిశుమందిర్ విభాగ్‌స్థాయి అధ్యక్షు లు డాక్టర్ దామోదర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కిసాన్‌గల్లీ శ్రీసరస్వతి శిశుమం దిర్ పాఠశాలలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంఈవో సుభాష్ తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ పోటీ లు రెండురోజులు జరుగుతాయని నిర్వాహకు లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబం ధకారిణి, సమితి సభ్యులు సాదుల కృష్ణదాస్, మహిపాల్, నాగేశ్, కాశీనాథ్, తూం దత్తాత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యం 'పది'లమేనా?



ప్రత్యేక స్టడీ మెటీరియల్‌తో పొన్కల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- గతేడాది టెన్త్ ఫలితాల్లో జిల్లా నంబర్ వన్
- అగ్రస్థానం కాపాడుకునేలా పటిష్ట ప్రణాళిక..
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- పర్యవేక్షణ చేస్తున్న జిల్లా విద్యాధికారి

నిర్మల్ ఖిల్లా: ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యకు తొలిమె ట్టు పదో తరగతి. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆ స్థానాన్ని ఈ ఏడాది కూడా నిలబెట్టుకోవాలని జిల్లా విద్యాశాఖ భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక విద్యా ప్రణాళిక అమలు చేస్తోంది. పేద, దిగువ మధ్య తర గతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పదో తరగతి ఉత్తీర్ణతపై భరోసా కల్పి స్తూ.. మంచి గ్రేడ్ పాయింట్లు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. సిలబస్ రివిజన్, పాఠ్యాంశాల్లో సందేహాల నివృతికి ప్రాధాన్యం ఇస్తోంది. సంబంధిత సబ్జెక్టు నిపుణులు, ఉపాధ్యా యులు స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్ష లకు సంసిద్ధులను చేస్తున్నారు. వెనుకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల..

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. మార్చి 18 నుంచి పరీక్షలు మొదలు కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో డీఈవోలు ఉపాధ్యాయులు, విద్యార్థులను సమా యాత్తం చేస్తున్నారు. పరీక్షలు అనగానే విద్యార్థుల తోపాటు, తల్లిదండ్రులు కూడా కాస్త ఒత్తిడికి గుర వుతుంటారు. మంచి మార్కులతో కూడిన గ్రేడింగ్ రావాలని కోరుకుంటారు. మంచి ఫలితాలే లక్ష్యం గా గత విద్యాసంవత్సరం జిల్లా విద్యాశాఖ ప్రణాళిక అమలు చేయడంతో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. ఈ సంవత్సరం కూడా మొదటి స్థానంలో నిలిచేలా విద్యాశాఖ కృషి చేస్తోంది.

సిలబస్ పూర్తి..

జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్, ఆయా గురు కుల సొసైటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠ శాలల్లో ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయిం ది. కొన్ని రోజులుగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేస్తూ పునశ్చరణ చేస్తున్నారు. ప్రతీవారం, నెల ఆయా సబ్జెక్టుల్లోని అన్ని పాఠ్యాం శాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇక భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, గణితం, సాంఘికశాస్త్రం తదితర సబ్జెక్టులకు ప్రత్యేకంగా తయారు చేసిన మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

ప్రత్యేక 'లక్ష్య'ంతో...

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన గత జూన్ నుంచే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కన బరుస్తున్నారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెం చేందుకు, సులభమైన పద్ధతిలో బోధన అభ్యసన ప్రక్రియ కొనసాగేలా విద్యాశాఖ 'లక్ష్య' కార్యక్రమా న్ని చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కర దీపికలు అందజేసింది. వారిలో విషయ నైపుణ్యం మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. వెనుకబడి న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేందుకు ఆ యా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ప్రత్యేక విధులు కే టాయించారు. నిత్యం వారిని పర్యవేక్షిస్తూ విద్య నైపుణ్యాలు పెంపొందించేందుకు మార్గనిర్దేశం చేసేలా కార్యాచరణ చేపట్టారు. వీటికి అదనంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి సందేహాలను సం బంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు తీర్చేలా చర్యలు చేపట్టారు.

బదిలీలు, ఎన్నికలతో స్వల్ప అంతరాయం..

ఈ విద్యా సంవత్సరంలోనే ఎన్నికలు, అంత కుముందు ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టా రు. దీంతో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఉపాధ్యాయులకు దశల వారీగా శిక్షణలు, ఇతర ఎన్నికల బాధ్యతల నిర్వర్తించడంతో సిలబస్ పూర్తి చేయడానికి స్వల్ప అంతరాయం కలిగింది. అయితే ఎన్నికలు పూర్తయిన అనంతరం పూర్తిస్థాయి లో సిలబస్‌పై దృష్టిపెట్టిన విద్యాశాఖ డిసెం బర్ చివరి నాటికి ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంది.

గతేడాది ఫలితాలు ఇలా..

గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితా ల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలి చింది. పదో తరగతి పరీక్షలకు 9,071 మంది విద్యార్థులు హాజరుకాగా.. 99 శాతం ఉత్తీర్ణ తతో 8,980 మంది పాస్ అయ్యారు. ఈసా రి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 6 వే ల మంది విద్యార్థులు, ప్రైవేటులో చదువు తున్న మరో 3 వేల మంది విద్యార్థులు పరీక్ష లకు హాజరు కానున్నారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు శ్రమిస్తున్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ...

పదో తరగతి ఫలితాల్లో గత విద్యా సంవత్స రంలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ స్థానాన్ని పదిలపరుచుకునే లక్ష్యంతో, ప్రత్యేక విద్యా ప్రణాళికతో ముం దుకెళ్తున్నాం. విద్యార్థులకు పరీక్షలు అంటే భయం తొలగిపోయేలా సిద్ధం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రస్తుతం రివిజన్ క్లాసులు, స్టడీ అవర్స్ కొన సాగుతున్నాయి. వంద శాతం ఉత్తీర్ణత తోపాటు ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

సోన్: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని భువన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌వో లతాదేవి, పీఈటీ ప్రియాంక తెలిపారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ – 14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో భువన ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 16న ఆర్మూర్‌లోని టీఎస్‌డ బ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో భువన పాల్గొంటుందని తెలిపారు.



విద్యార్థిని భువనతో ఉపాధ్యాయులు

మున్సిపల్ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

- విధుల్లో అలసత్వం వీడాలని హెచ్చరిక
- వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశం
- మొండి బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని సూచన



సమావేశంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలసి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు వసూలు చేసిన పన్నుల వివరాలు ఆర్ఐ, బిల్ కలెక్టర్లను అడి గి తెలుసుకున్నారు. సిబ్బంది అడిగినదానికి సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అసలు ఫీల్డ్‌లోకి వెళ్తున్నారా అని మందలించారు. పన్నులకు సంబంధించిన రిజిస్ట ర్లు, రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద శాతం పన్ను వసూలు లక్ష్యం సాధించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని హెచ్చరించారు. ప్రతీరోజు ఫీల్డ్‌కు వెళ్లా లని సూచించారు. ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న వారిని గుర్తించి, మొండి బకాయిలు వెంటనే వసూలు చేయాలన్నారు. లేని పక్షంలో నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు 2,80,489

- చివరిరోజు 35 వేలపైనే..
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు



దరఖాస్తులు స్వీకరిస్తున్న రామారావు పటేల్

నిర్మల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన ప్రజాపాలనకు జిల్లాలో దరఖాస్తులు పోటె త్తాయి. ఎనిమిది రోజుల్లో మూడు మున్సిపాలిటీల తోపాటు జిల్లాలోని 19 మండలాల్లో కలిపి మొత్తం 2,80,489 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రభు త్వం పేర్కొన్న ఐదు గ్యారంటీలతోపాటు ఇతర పథకాలు, సమస్యలపైనా ఇచ్చిన దరఖాస్తులు ఉన్నాయి.

ఐదు గ్యారంటీలకు..

అభయహస్తం దరఖాస్తుల కింద పేర్కొన్న ఐదు గ్యారంటీలైన మహాలక్ష్మి, చేయూత పింఛన్లు, రూ.500 గ్యాస్‌సిలిండర్, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డుల్లో చేపట్టిన సభలు ముగిశాయి. సభలతోపాటు మున్సిపల్ కార్యాల యాల్లోనూ దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు జిల్లాలో మొత్తం 2,37,701 వచ్చాయి.

ఇతర దరఖాస్తులూ..

ప్రభుత్వం పేర్కొన్న ఐదు గ్యారంటీలతోపాటు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, ఇతర సమస్యలకు సం బంధించి కూడా ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చారు. వీటిని కూడా సిబ్బంది నమోదు చేశారు. ఇవి మొత్తం కలిపి 42,788 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా రేషన్‌కార్డులకు సంబంధించి నవే ఉన్నాయి. ఇక మండలాలవారీగా పరిశీలిస్తే సారంగపూర్‌లో అత్యధికంగా 16,824, అత్యల్పం గా దస్తురాబాద్‌లో 5,168 ప్రజాపాలన దరఖాస్తు లు వచ్చాయి. నిర్మల్ మున్సిపాలిటీలో 29,028, భైంసాలో 14,956రాగా, ఖానాపూర్‌లో కేవలం 5,969 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

ప్రజాపాలన వివరాలు..

మొత్తం గ్రామాలు	401
మొత్తం మున్సిపల్‌వార్డులు	80
మొత్తం ఇళ్లు	2,10,432
ఐదుగ్యారంటీల దరఖాస్తులు	2,37,701
ఇతర దరఖాస్తులు	42,788
మొత్తం దరఖాస్తులు	2,80,489

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి
- అండర్ – 14 జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం



విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న డీఈవో

లక్ష్మణచాంద: విద్యార్థులు చదువుతోపాటు క్రీడ ల్లోనూ రాణించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచిం చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండ ర్–14 జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి డీఈవో పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కాసేపు కబడ్డీ ఆడారు. అనంతరం మాట్లాడుతూ పిల్లల్లో మానసిక, శారీరక వికాసానికి, శారీరక దారుఢ్యం పెంపొందేందుకు క్రీడలు దోహదపడు తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చాటే విద్యార్థు లకు పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ, ఇతర కళాశాలల్లో ప్రవేశానికి అవకాశం ఉంటుందని తెలిపారు. క్రీడ ల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పా ట్లు చేసిన సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, గ్రామ పెద్దలను అభినందించారు. అనంతరం నిర్వహిం చిన పోటీల్లో నిర్మల్ జిల్లా జట్టు మొదటి స్థానంలో, ఆదిలాబాద్ జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచా యి. విజేతలకు ఎంపీపీ అద్వాల పద్మ బహుమతు లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నవీన్, మండల నోడల్ అధికారి అశోక్‌వర్మ, ఎఫ్ఏవో జిల్లా పరీక్షల విభాగపు కమిషనర్ పద్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రమణారావు, ఎంపీడీ వో చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు సిరాజుద్దీన్, హె చ్ఎం రాజునాయక్, పీడీ శ్రీనివాస్, వీడీసీ సభ్యు లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిలిచిన అవిశ్వాసం

- కోర్టు నుంచి స్టే తెచ్చిన వైస్ ఎంపీపీ
- తదుపరి ఆర్డర్ వచ్చే వరకూ సమావేశం వాయిదా



స్టే ఆర్డర్ కాపీ సారాంశం వివరిస్తున్న ఆర్డీవో

సారంగపూర్: ఎంపీపీ పదవిపై ఆశలు పెంచుకున్న బీజేపీ ఎంపీటీసీలకు అసంతృప్తే మిగిలింది. వైస్ ఎంపీపీ పతాని రాధ కోర్టును ఆశ్రయించడంతో ఎంపీపీ పదవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి కోర్టు స్టేతో బ్రేక్ పడింది. కోర్టు స్టే కారణంగా శనివారం నిర్వహించాల్సిన అవిశ్వాస ప్రక్రియ నిలిచిపోయి నట్లు ఆర్డీవో రత్నకళ్యాణి తెలిపారు. తదుపరి ఉత్త ర్వులు వచ్చే వరకూ సమావేశం వాయిదా వేస్తు న్నట్లు ప్రకటించారు. ఇదివరకు ఎంపీపీగా పనిచే సిన అట్ల మహిపాల్‌రెడ్డి తనపై అవిశ్వాసం పెట్టను న్నారని వచ్చిన పుకార్ల నేపథ్యంలో డిసెంబర్ 13న ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అదేరోజు బీజేపీ ఎంపీటీసీ సభ్యులు 9 మంది కలిసి ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవోకు నోటీసు అందజేశారు. ఆతర్వాత వైస్ ఎంపీపీ పతాని రాధను ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ జెడ్పీ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. అవిశ్వాసం ప్రక టించిన బీజేపీకి చెందిన 9 మంది ఎంపీటీసీలు తర్వాత శిబిరాలకు వెళ్లారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి బలనిరూ పణ చేసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో బీజేపీ ఎంపీటీ సీలు 9 మంది ఎంపీడీవో కార్యాలయానికి చేరుకు న్నారు. అయితే ఇన్‌చార్జి ఎంపీపీ రాధ శుక్రవారం రాత్రే ఆర్డీవోను కలిశారు. అవిశ్వాసంపై కోర్టు స్టే ఇచ్చినట్లు ఆర్డర్ అందించారు. దీంతో శనివారం సమావేశం ప్రారంభం కాగానే కోర్టు స్టే ఆర్డర్‌ను ఎంపీటీసీలకు సూచించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రక టించారు. ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుప తిరెడ్డి, బీజేపీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'గురుకుల' దరఖాస్తు గడువు పెంపు

సోన్: గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పెంచినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి కె.అలివేలు తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవే శాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఫలితాల్లో మెరిట్, రిజర్వే షన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివ రాలకు 180042545678 నంబర్‌లో సంప్రదిం చాలని సూచించారు.

క్లుప్తంగా

నిజాయతీ చాటుకున్న హోంగార్డులు



రింగును అందిస్తున్న హోంగార్డులు

భైంసా: బాసర ఆలయంలో భక్తులు పోగొట్టుకున్న బంగారు రింగును తిరిగి ఇచ్చి హోంగార్డులు నిజాయతీ చాటుకున్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నిప్పెటపాడు గ్రామానికి చెందిన నరేశ్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి బాసర వచ్చారు. ఆలయంలో తమ కూతురు బంగారు రింగును పోగొట్టుకుంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అశోక్, శోభ, వెన్నెలకు ఈ రింగు దొరకడంతో నరేశ్‌బాబు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజాయతీ చాటుకున్న హోంగార్డులను పలువురు అభినందించారు.

ఆవుకు అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న రైతులు

కుంటాల: మండలంలోని లింబా(కె)లో రైతు దేవన్నకు చెందిన ఆవు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. 35 ఏళ్లుగా తన వద్ద ఉన్న ఆవు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, రైతులు గ్రామంలో ఊరేగింపుగా భజన చేస్తూ, భాజా భజంత్రీలతో తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

దండేపల్లి: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రెబ్బనపల్లికి చెందిన గోళ్ల పూర్ణచందర్ ఇంట్లో శనివారం గ్యాస్ సిలిండర్ పేలింది. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బీరువాలో దాచిన సుమారు రూ.3 లక్షల నగదు, నగలు, బట్టలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్‌ఐ భూమన్న సందర్శించారు. సుమారు రూ.14 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

బైక్ ఢీకొని మేకల కాపరికి గాయాలు

వేమనపల్లి: బైక్ ఢీకొని మేకల కాపరి గాయాలపాలైన సంఘటన మండలంలోని గొర్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల కాపరి చెండే మొండి శనివారం సాయంత్రం మేకల మందతో గ్రామంలోకి వెళ్తుండగా వేమనపల్లి నుంచి గొర్లపల్లికి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జలేందర్ ఢీకొట్టాడు. దీంతో మొండికి తీవ్రగాయాలు కాగా ఒక మేక సైతం మృతి చెందింది. స్థానికులు నీల్వాయి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సుబ్బారావు హోంగార్డును పంపించివివరాలు సేకరించారు.

సైబర్ దోపిడీ!



సులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడితే అసలుకే మోసం వస్తుంది. ఒక్కసారి సైబర్ నేరస్తుల మాటల మాయలో పడితే చాలు బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. లక్కీడ్రా తగిలిందనో.. గిఫ్ట్ కూపన్ గెలుచుకున్నారనో.. ఒక్కసారి పెట్టుబడితో డబ్బు రెట్టింపు అవుతుందనో చెబుతూ సైబర్ మాయగాళ్లు వల వేస్తున్నారు. కొందరు ఆ వలలో చిక్కి డబ్బు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయించి ఎంతో కొంత వెనక్కి పొందుతున్నారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

• అత్యాశపడితే అసలుకే మోసం • రూ.కోట్లలో ప్రజలకు టోకరా • అప్రమత్తతే రక్షణ

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

ఆర్థిక మోసాలు, చిన్నారులు, మహిళలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్థిక మోసాలకు సంబంధించి ఫిర్యాదు చేసే సమయంలో సంబంధిత బ్యాంకు /వాలెట్, లావాదేవీకి సంబంధించి 12అంకెల ఐడీ /యూటీఆర్ నంబరు, మోసం జరిగిన తేదీ, ఎంత మొత్తం, ఇందుకు అవసరమైన సాఫ్ట్‌కాపీ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. https:// www. cybercrime. gov. in/ వెబ్‌సైట్ ద్వారా గానీ 1930 నంబరుకు డయల్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చు.

పోలీసుల అవగాహన

సైబర్‌నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో జాగృతి దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ బుధవారం ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో స్కూళ్లు, కాలేజీల్లో, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కొన్ని సంఘటనలు..

- మంచిర్యాలకు చెందిన రాజ్‌కుమార్(పేరు మార్చాం) సమాజంలో పేరున్న వ్యక్తి. ఓ రోజు తన ఫేస్‌బుక్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ రాగా ఆక్సెప్ట్ చేశాడు. అదే రోజు రాత్రి వాట్సాప్‌కు హాయ్ అంటూ మెసేజ్ రావడం, ఆ తర్వాత వీడియో కాల్ చేయడం జరిగాయి. కాల్ లిఫ్ట్ చేయగానే ఓ మహిళ నగ్నంగా కనిపించింది. ఆ తర్వాత ఫోన్ కట్ అయింది. ఇక ఇద్దరి ఫొటోలు మార్ఫింగ్ చేసి ఆ మహిళ డబ్బులు డిమాండ్ చేసింది. పరువు పోతుందనే భయంతో రూ.10వేలు పంపించాడు. అంతటితో ఆగకుండా బ్లాక్‌మెయిల్ చేయడంతో పోలీసులను ఆశ్రయించి విముక్తి పొందాడు.
- మంచిర్యాలలోని గౌతమినగర్‌కు చెందిన ఓ వ్యాపారికి లక్కీ డ్రా తగిలిందని వాట్సాప్ లింకుతో మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేసి చూడగా ఓటీపీ వస్తుందని, ఓటీపీ చెప్పగానే బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని సమాచారం ఉంది. ఓటీపీ చెప్పడంతో క్షణాల్లో అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.3.10లక్షలు డ్రా అయ్యాయి. మోసపోయానని గ్రహించిన సదరు వ్యాపారి వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగి మూడు రోజుల్లోనే వ్యాపారి కోల్పోయిన నగదును ఇప్పించారు.
- ఆదిలాబాద్‌లో ఓ మహిళ ఇన్‌స్టాగాంలో లక్కీ కూపన్ వచ్చిందనే సమాచారం మేరకు మొదట రూ.20వేలు చెల్లించింది. జీఎస్టీ ఇతర సమస్యలు అంటూ రూ.80వేల వరకు సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. మోసపోయానని గ్రహించిన సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు కూపన్లను నగదుగా మార్చుకోవచ్చు, ఏవైనా వస్తువులు కొనుగోలు చేయవచ్చంటూ ఐదేసి కూపన్లు పంపించాడు. ఒక్కో కూపన్ విలువ రూ.20వేలు అంటూ నమ్మించాడు. మరో ఉన్నతాధికారి పేరిట మెసేజ్ రావడంతో నిజమని నమ్మి ఒకరు రూ.లక్ష పంపించారు. మళ్లీ మరో రెండు కూపన్లు పంపించడంతో అనుమానం వచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 239 సైబర్ కేసులు నమోదయ్యాయి. వీటిల్లో చాలా వరకు బాధితులు డబ్బులు కోల్పోవాల్సి వచ్చింది.

- మంచిర్యాల జిల్లాలో గత ఏడాది 177 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 183మంది బాధితులు రూ.1,96,76,132 పోగొట్టుకున్నారు.
- రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎన్‌సీ ఈఆర్‌టీ పోర్టల్ ద్వారా స్వీకరించిన కేసుల్లో రూ.21,97,337 మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు.
- నిర్మల్ జిల్లాలో 2022లో 41 సైబర్ కేసులు నమోదు కాగా, 2023లో 17 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది బాధితులు రూ.1,38,80,372 కోల్పోయారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానిత వ్యక్తుల్లోని బ్యాంకు ఖాతాల్లో రూ.25,49,759 ఫ్రీజ్ చేశారు. రూ.5,62,175 బాధితులకు తిరిగి ఇప్పించారు.
- కుమురంభీం జిల్లాలో గత ఏడాది 26 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2022 సంవత్సరంతో పోల్చి చూస్తే 2023లో సైబర్ నేరాలు 23.53శాతం తగ్గాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో 2022లో 27 కేసులు నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదయ్యాయి.

వెంటనే ఫిర్యాదు చేయాలి



సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు గానీ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కు గానీ ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉచితంగా ఏదీ రాదు. వాట్సాప్ గ్రూపుల్లో ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దు. ఎలాంటి సమాచారం ఎవరికీ ఇవ్వొద్దు. గుర్తు తెలియని వ్యక్తుల వీడియో కాల్స్ లిఫ్ట్ చేయకూడదు. కొందరు సాధారణ కాల్స్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, అకౌంట్ అప్‌డేట్ చేయాలని వివరాలు అడుగుతారు.. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదు. సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

జాతీయ సదస్సుకు ఆహ్వానం

బోథ్: భారత వికసిత్ కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలోని నా సిక్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు జరగనున్న జాతీయ యువజన సదస్సుకు మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్‌కు కేంద్రం యువజన మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందింది. గతంలో కర్ణాటక, ఢిల్లీలో జరిగిన కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నట్లు సోమేశ్వర్ తెలిపారు.

విధులను ఆటంకపర్చిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జైలు నుంచి రిమాండ్ ఖైదీలను కోర్టుకు తీసుకువచ్చిన ఎస్కార్ట్ విధులను ఆటంకపర్చిన ఇద్దరిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని శనివారం కోర్టుకు తీసుకువచ్చారు. వారి స్నేహితులైన రవీంద్రనగర్‌కు చెందిన రాకేష్, దోబీకాలనీకి చెందిన వీరకుమ్ర రాజు వారికి భోజనం ఏర్పాటు చేస్తామని, ఇతర వస్తువులు ఇస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విధులను ఆటంక పరిచారని ఏఆర్ హెడ్ కానిస్టేబల్ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అక్రమ మొరం తవ్వకాలపై ఆందోళన



ఆందోళనకు దిగిన ఆయా గ్రామాల ప్రజలు

దిలావర్‌పూర్: మండలంలోని మాయాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డేపల్లి సమీపంలో ఉన్న ఇసుక గుట్ట ప్రాంతంలో మొరం తవ్వకాలపై శనివారం బన్సపల్లి , కంజర్, వడ్డేపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం గుట్ట ప్రాంతంలో అక్రమంగా మొరం తీయడంతో ప్రజలు అడ్డుకున్నారు. పలువురు భూస్వాములు డీవన్ పట్టాలు తీసుకువచ్చి తమ దేవుని మాన్యాలను, ఖాళీ భూములను అప్పనంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

- కారు, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌రూరల్: గతేడాది డిసెంబర్ 18న మావల సమీపంలో దళిత యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు ఉష్కం రఘుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ ఉమేందర్ శనివారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మావల గ్రామానికి చెందిన ఎంబడి వంశీతో రఘుపతి కూతురుకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో వంశీని ఎలాగైనా హత్య చేయాలని రఘుపతి నిర్ణయించుకున్నాడు. నవంబర్ 25న చౌహాన్ రవి, అశోక్‌లతో రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని ముందుగా రూ.లక్ష ఇచ్చేశాడు. నవంబర్ 29న వారిని కారులో తీసుకెళ్లి వంశీ ఇంటిని చూపించాడు. హత్య చేయడానికి జీపు కావాలని అశోక్ దిల్షాద్‌ను సంప్రదించగా ఆయన రాజుతో మాట్లాడి జీపును సిద్ధం చేశాడు. హత్యాయత్నానికి ఒకరోజు ముందు రవి, అశోక్ గ్రామంలో రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 18న ఉదయం 5 గంటల ప్రాంతంలో వంశీ ఇంటినుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లగా వెనుకనుంచి జీపుతో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వంశీ తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చౌహాన్ రవి, అశోక్, దిల్షాద్, రాజు, గంగన్నలను గతంలోనే అరెస్టు చేయగా శనివారం ఉష్కం రఘుపతి మావల గ్రామానికి వస్తున్నాడని సమాచారం రావడంతో మావల శివారు ప్రాంతంలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు, మావల ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

- రూ.4 లక్షల నగదు, రెండు తులాల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీకి చెందిన వ్యాపారి మహ్మద్ గౌస్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం సాయంత్రం సదరు వ్యాపారి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న శుభ కార్యానికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో రూ.4 లక్షల నగదు, రెండు తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో శనివారం ఉదయం ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా విచారణ చేపట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు మృతి



మోహన్ (ఫైల్)

కుంటాల: అనారోగ్యంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సుద్దపు మోహన్ (31)కు శుక్రవారం మధ్యాహ్నం బీపీ ఎక్కువ కావడంతో బస్టాండ్ ప్రాంతంలో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్‌కు తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన తాజ్ అహ్మద్ (23) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన తాజ్ అహ్మద్ శనివారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. అధి కారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఓ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం దగ్ధం చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. కాలనీలో పార్కింగ్ చేసి ఉన్న ఆటోను అర్ధరాత్రి దగ్ధం చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు పరమేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

భైంసాటౌన్: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారి శ్రావణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక, ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు (2022–23 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు) ఈ ఉపకార వేతనాలకు అర్హులని, ఆయా కోర్సుల్లో విద్యార్థుల మార్కుల శాతం ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు ఫారాలు పొందవచ్చని, పూర్తి చేసిన ఫారాలను ఫిబ్రవరి 15లోగా సంబంధిత కార్మికశాఖ కార్యాలయాల్లో అందించాలన్నారు. పది, ఐటీఐ విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ(అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్) బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లమా/పీజీ ఇన్ మెడికల్ లాబోరేటరీ టెక్నీషియన్ విద్యార్థులకు రూ.2వేల చొప్పున ఉపకార వేతనాలు ఉంటాయని, ఎంపికైన వారికి మేడే నాటికి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



కాలిన పత్తి బేళ్లు

బోథ్: మండల కేంద్రంలోని శ్రీదత్త జిన్నింగ్ మిల్లులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. పత్తి జిన్నింగ్ అయ్యే క్రమంలో మిషన్‌లో ఉన్న బెల్టు తెగిపోవడంతో జిన్నింగ్ మిషన్‌లో బండరాళ్లు రాపిడికి గురయ్యాయి. దీంతో మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. అప్రమత్తమైన జిన్నింగ్ ఫ్యాక్టరీ సిబ్బంది నీటితో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం పేర్కొంది.

సెల్ఫ్ సర్వీస్!

- పెద్దాస్పత్రిలో రోగులపై నిర్లక్ష్యం



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది. అయితే ఇదంతా నాణేనికి ఒక వైపేనని చెప్పాలి. ఇక్కడ వైద్యసేవలు మెరుగుపడినా చికిత్స కోసం వచ్చే రోగుల విషయంలో సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అనారోగ్య సమస్యలు, ప్రమాదాల బారిన పడిన వారు వచ్చినప్పుడు వీల్ చైర్, స్ట్రెచర్‌పై ఆయా విభాగాల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రధాన ద్వారం వద్ద సిబ్బందిని కేటాయించడంలేదు. శనివారం ఉదయం అనారోగ్యంతో ఉన్న పేషెంటును 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. జిల్లా ప్రధాన ద్వారం వద్ద వీల్ చేర్ ఉన్నా లోపలికి తీసుకెళ్లడానికి సిబ్బంది లేకపోవడంతో పేషెంట్ బంధువులే ఇబ్బంది పడుతూ స్ట్రెచర్‌పై పడుకోబెట్టి వైద్యుడి వద్దకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో



వివరాలు తెలుసుకుంటున్న వికాస్ మహతో

ఇంద్రవెల్లి: కొలాం గిరిజన గ్రామాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడను సందర్శించారు. కొలాం గిరిజనులతో సమావేశమై వారి స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా కొలాం గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించడం జరుగుతుందన్నారు. సీసీ రోడ్లు, తాగు నీటి సౌకర్యం, విద్యుత్, డ్రెయినేజీలు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఇండ్లు, వ్యక్తిగత రుణసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15న నుంచి పథకం అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్క పూలాబాయి, పంచాయతీ కార్యదర్శి జరీనా, తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా ఉట్నూరు



ఉట్నూరు విద్యార్థులకు బహుమతిని అందజేసిన ఎమ్మెల్యే కూనంనేని, పీఓ ప్రతీక్‌జైన్

- కిన్నెరసానిలో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీలో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఇక రెండో స్థానాన్ని భద్రాచలం ఐటీడీఏ పరిధి విద్యార్థులు దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జిల్లా బృందం



శిల్పారామంలో జానపద గీతికలను ప్రదర్శిస్తున్న జిల్లా కళాకారులు

నిర్మల్ ఖిల్లా: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర యువజనోత్సవాల్లో నిర్మల్ జిల్లాకు చెందిన చెనికారపు నాగరాజు కళాకారుల బృందం శనివారం ప్రదర్శన ఇచ్చింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో జిల్లాస్థాయి ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి నాగరాజు కళాకారుల బృందం ఎంపికైంది. జిల్లాకు చెందిన కళాకారుల బృందంలో శనిగారపు నాగరాజుతోపాటు శ్రీకాంత్, సల్మాన్, సాయిరాం, రాజు, పెంటన్న, స్వామి, రాజశేఖర్, వినోద్, సుప్రియ, మంజుల తదితరులు పాల్గొన్నారు.